క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీతానగరం సర్కిల్ పరిధిలోని గాదెలవలసలో అధికారులు శుక్రవారం దాడులు చేపట్టగా పది మద్యం సీసాలతో ఒకరు పట్టుబడినట్లు సీఐ డి. పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే సర్కిలపరిధిలోని బలిజిపేట, గరుగుబిల్లి, సీతానగరం మండలాల్లో సిబ్బందితో ముమ్మరంగా దాడులు చేపడుతున్నామన్నారు.

గిరిజన హక్కులు కాపాడాలి..

పార్వతీపురం టౌన్: జీఓ నంబర్ 3 పునరుద్ధరణ, 1/70 పీసా చట్టం పక్కాగా అమలు చేయడంతో పాటు గిరిజన చట్టాలు, హక్కులు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ గౌరవ దివస్‌లో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు నష్టం చేసే నిర్ణయాలు, ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు.

పిల్లలకు వాహనాలిస్తే చర్యలు తప్పవు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఎం.పాపయ్య

పార్వతీపురంటౌన్: మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని ట్రాఫిక్ ఎస్సై ఎం. పాపయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎఫ్‌ఓబీపై మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది అర్జున దొర, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

పార్వతీపురం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీ మోహనరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, కె. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల మొదటి వారంలో చేపట్టాల్సిన పదోన్నతులు విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉందని నిలిపివేశారని పేర్కొన్నారు. అయితే కోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల కోడ్ రద్దు అయినందున వెంటనే షెడ్యూల్ ప్రకటించి పదోన్నతులు చేపట్టాలని కోరారు. మొదట షెడ్యూల్ ఇచ్చినప్పుడు అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు ఇవ్వలేదని, వెంటనే అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో 70:30 నిష్పత్తిలో 70 శాతం పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన

సాలూరు: చెత్త నుంచి సంపద సృష్టిపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని సాలూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎఫ్ఓ ప్రసూన తెలిపారు. సాలిడ్, లిక్విడ్ సోర్స్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా సంపద సృష్టి కోసం వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ఎంపీడీఓ రమాదేవి, రిసోర్స్‌పర్సన్ పద్మజ, శానిటేషన్ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

పార్వతీపురం: మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినం సందర్భంగా డిసెంబర్ పది వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి మరుగుదొడ్ల వినియోగం, ఆవశ్యతపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు పత్రాలు జారీ చేయడం, అందంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలు, విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు దగా..

- బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు
- మండిపడుతున్న ప్రజానీకం



పార్వతీపురం టౌన్: కూటమి సర్కారు తన బడ్జెట్‌లో దళితులకు నామమాత్రపు కేటాయింపులు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే దళితులంటే ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం రూ. 2.94 లక్షల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి దళిత సంక్షేమానికి నామమాత్రంగా కేటాయించడంపై గిరిజనం మండిపడుతున్నారు. దళితుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి రూ.18,497 కోట్లు మాత్రమే కేటాయించడం ఎంతవరకు సమంజసమని దళితులు ప్రశ్నిస్తున్నారు. ఇది గత బడ్జెట్ కన్నా రూ.150 కోట్లు తక్కువని మండిపడుతున్నారు. నిజానికి జనాభా దామాషా పద్ధతి ప్రకారం దళిత సంక్షేమానికి 17 శాతం లెక్కన రూ. 23 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.18 వేల కోట్లు కేటాయించడం చూస్తే దళితులను అవమానించడమేనని చెప్పక తప్పదు.

సూపర్ సిక్స్ పథకాలు ఉత్తిదేనా...

సూపర్ సిక్స్ పథకాల విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. యువతకు నిరుద్యోగ భృతి రూ.36 వేల కోట్లు, ఆడబిడ్డల సంక్షేమానికి రూ.32,400 వేల కోట్లు, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ,. 1750 కోట్లు కావాల్సి ఉండగా.. బడ్జెట్‌లో కేటాయించకపోవడం శోచనీయం. తల్లికి వందనం పథకానికి రూ. 12,600 కోట్లు అవసరం ఉండగా బడ్జెట్‌లో కేటాయించింది కేవలం రూ. 5,387 కోట్లు మాత్రమే. అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 10,716 కోట్లు అవసరం కాగా కేటాయించింది కేవలం వెయ్యి కోట్లు మాత్రమే. ఈ లెక్కన చూస్తుంటే సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడేసినట్లేనని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రతి పథకాన్ని నీరుగార్చారు..



కూటమి పాలకులు ప్రతి పథకాన్నీ నీరుగార్చారు. ఇప్పటికి ఐదు నెలల్లో వేల కోట్ల రూపాయలు అప్పులు చేసిన ప్రభుత్వం ఇంకా రూ. 19,000 కోట్ల అప్పుల భారం ప్రజలపై మోపడానికి సిద్ధంగా ఉంది. దళిత సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించకపోవడాన్ని ఖండిస్తూ దళితులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావ్వాలి.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

ప్రణాళికల తయారీలో అధికారులే కీలకం

- ఎంపీడీఓ త్రివిక్రమరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు, పక్కన ఏపీఎం శ్రీరాములు

సీతానగరం: గ్రామ పంచాయతీ ప్రణాళికల తయారీలో అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ పథకం అమలుపై మండల స్థాయి అధికారులు, వెలుగు ఈఓఏలతో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. అధికారులంతా పంచాయతీ పాలకవర్గాలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రిసోర్స్‌పర్సన్లు మనోహర్, శ్రీనివాస్, శంకరరావు, పీటర్, వెలుగు వీఓఏలు పాల్గొన్నారు.

ఎంపిక చేసిన రీచ్‌ల నుంచి ఇసుక



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నదిలో నిర్దేశించిన రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు అనుమతిస్తున్నట్లు ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సచివాలయాల సర్వేయర్లు, ఇంజినీరింగ్ సహాయకులు, వీఆర్వోలతో ఇసుక తరలింపు విషయమై ఏపీఓ భాను ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బూర్జ, సీతానగరం రేవుల నుంచి ఇసుక తరలించడానికి అనుకూలంగా ఉందన్నారు. మిగతా రేవుల నుంచి ఇసుక తరలించాలంటే ఉన్నతాధికారుల అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పారు. సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు ఏయే రేవుల నుంచి ఎంతెంత ఇసుక తరలిస్తున్నారో నమోదు చేయాలని సూచించారు.

అడవులను రక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖ రేంజర్ శ్రీరామ్ నరేష్ బిర్లంగి

- అటవీశాఖ రేంజర్ శ్రీరామ్ నరేష్

పార్వతీపురం టౌన్: అడవులను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్ బిర్లంగి అన్నారు. మండలంలోని సీతంపేట గిరిజన గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు వ్యవసాయం చేయరాదని, అడవులను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

అడవులను రక్షించుకుంటే మనకి ఆహారం, నీరు, స్వచ్ఛమైన గాలి అందుతుందని చెప్పారు. గంజాయి సాగు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి మనోజ్, వివిధ సంఘాల నాయకులు శ్రీరాము, వరహాలమ్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి

- పట్టణంలో ఆధ్యాత్మిక శోభ
- ఆలయాల్లో జ్వాలాతోరణాలు, దీపోత్సవాలు



పాలకావిళ్లతో అయ్యప్పస్వాముల తిరువీధి



కామాక్షమ్మ ఆలయంలో జ్వాలాతోరణం

సాలూరు: కార్తీక పౌర్ణమి పూజలను ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అయ్యప్పస్వాములు పాలకావిళ్లతో పట్టణంలో తిరువీధి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి. పట్టణం, మండలం నుంచి వచ్చిన స్వాములు అయ్యప్ప స్వామికి క్షీరాభిషేకాలు చేశారు. పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి, కామాక్షమ్మ, తదితర ఆలయాల్లో భక్తులు దీపారాధనలు, జ్వాలాతోరణాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పంచముఖేశ్వర ఆలయంలో దీపోత్సవం

బిర్సా ముండాకు నివాళులు..



మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ చైర్మన్ ధర్మారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని పోస్ట్‌మెట్రిక్ ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జేఏసీ చైర్మన్ కొండగొర్రి ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిర్సా ముండా, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పోరన్న, మల్లన్న వంటి గిరిజన పోరాట యోధుల జీవిత పాఠాలను ఆదర్శంగా తీసుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మంచాల పారమ్మ, నందివాడ కృష్ణబాబు, ఏజేఏసీ జాయింట్ సెక్రటరీ దుక్క సీతారాం, వైస్ చైర్మన్లు కె. ఉదయ్‌కుమార్, ఉర్లక మల్లయ్య, సీదరపు రాజు, నిమ్మక అన్నారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు హిమరక పకీరు, మండంగి శివ పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



వెంకంపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పార్వతీపురం: పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని చినబొండపల్లి, వైకేఎం నగర్, నరిసిపురం, ఎంఆర్ నగరం, తదితర ప్రాంతాల్లోని శివాలయాలలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకంపేట శివాలయంలో ఆకాశదీపాలు వెలిగించారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో...



పార్వతీపురం టౌన్: దేవాంగుల వీధిలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్: కార్తీక పౌర్ణమి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని దేవాంగుల వీధి, వైకేఎం కాలనీ, కొత్తవలస, తదితర ప్రాంతాల్లో మహిళలు సామూహికంగా పూజలు జరుపుకున్నారు. కొంతమంది ఇళ్లల్లో లక్ష్మీదేవి పూజలు చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పాలకొండ రూరల్: పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు గృహ నిర్మాణాల కోసం కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 1900 మంది నివాసాలు ఏర్పర్చుకునేందుకు మంజూరు చేసిన స్థలాన్ని, అక్కడ నిర్మణాలు చేపట్టిన లబ్ధిదారులను శుక్రవారం సంఘ సభ్యులు కలిసి మాట్లాడారు. వారి సమస్యలు అగిడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్య పరిరక్షణతో పాటు ఇతర మౌలిక వసతులు సంపూర్ణంగా కల్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 18న స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు పాలకొండ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు.

చినభోగిలిలో వైద్య శిబిరం..



సీతానగరం మండలంలోని చినభోగిలి సచివాలయ ఆవరణలో చినభోగిలి యూత్ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 257 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 48 మందిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషా, సర్పంచ్ కె. రాధ, శ్రీనివాసరావు, బాలు, రాజు, జెమ్స్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. – సీతానగరం

సమస్యలు పరిష్కరించాలి..



108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సంఘ ప్రధాన కార్యదర్శి తెర్లి వెంకటరమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2005లో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 108 అంబులెన్స్ వ్యవస్థ దేశంలోని అత్యున్నతమైన ప్రజాసేవగా గుర్తింపు పొందిందన్నారు. అలాంటి వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు నేటికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సదుపాయాలు లేవన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు కనీస వేతనాలు, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని, లేని ఎడల మీ నెల 25 నుంచి సమ్మె చేపట్టక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, 108 ఉద్యోగుల సంఘ నాయకులు తెంటు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్

పాలకావిడి ఉత్సవం..



కార్తీక పౌర్ణమి సందర్భంగా గురుస్వామి పాచిపెంట సంతోష్ ఆధ్వర్యంలో పాచిపెంట, కోటికిపెంట, కేసలి, తోటవలస, గురువునాయుడుపేట గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు మండల కేంద్రంలో శుక్రవారం పాలకావిడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక దుర్గాదేవి ఆలయం నుంచి పాలకావెళ్లతో భక్తులు అయ్యప్ప స్వామి పాటలు పాడుకుంటూ శివాలయం వరకు వెళ్లి అక్కడున్న అయ్యప్పస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం 300 మంది స్వాములకు ఆలయ ఆవరణలో అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు లక్కోజి గణపతిరావు, పల్లేడ వెంకటరమణ, తాడుతూరి శివప్రసాద్, ఆకుల సూర్యనారాయణ మాదిరెడ్డి సత్యనారాయణ, ఎవర్న తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు. – పాచిపెంట

పౌర్ణమి దీపారాధన ..



కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక రామమందిరంలో శుక్రవారం రాత్రి లక్ష దీపారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు వై. జోగినాయుడు, పరిశినాయుడు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. – సీతానగరం

భూ వివాదంపై దర్యాప్తు



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామ పంచాయతీ పెదఘాశిల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 80–1లో రెండెకరాల జిరాయితీ భూమి వివాదంపై తహసీల్దార్ షేక్ ఇబ్రహీం శుక్రవారం దర్యాప్తు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కొండపుట్టి గ్రామానికి చెందిన రైతు భాగవతుల నరసింహులు ఆ సర్వే నంబర్‌లోని భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమికి ఆనుకుని ఉన్న కొంతభూమి తమదేనని మార్కొండపుట్టి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అడ్డు తగలడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో రైతు నరసింహులుకు చెందిన పంటను కొంతమంది వ్యక్తులు శుక్రవారం ఉదయం నాశనం చేయడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో అడ్డుకోవడానికి ప్రయత్నించిన నరసింహులు ప్రత్యర్థి వర్గం దాడి చేయడంతో గాయపడ్డాడు. ప్రస్తుతం బాధిత రైతు సాలూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ షేక్ ఇబ్రహీం సంబంధిత భూమిని శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఇరువర్గాలూ తమ దగ్గరున్న ఆధారాలతో మంగళవారం కార్యాలయానికి రమ్మని తహసీల్దార్ సూచించారు.